నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

13 హైదరాబాద్, శనివారం 2 మార్చి 2024 SANGAREDDY


## నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలి

### గీతం ఇండస్ట్రియల్ కాంక్లేవ్-1.0లో వక్తలు



గీతం వర్సిటీ సదస్సులో మాట్లాడుతున్న పరిశ్రమల ప్రతినిధులు

పటాన్‌చెరు, మార్చి 1 : పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువత నైపుణ్యాలను నేర్చుకుని సిద్ధం కావాలని, అందివస్తున్న ఆధునిక సాంకేతికతపై పట్టుసాధించాలని పలు పరిశ్రమలకు చెందిన ఉన్నతాధికారులు సూచించారు. శుక్రవారం గీతం వర్సిటీలో కెరీర్ గైడెన్స్ కేంద్రం ఆధ్వర్యంలో గీతం ఇండస్ట్రియల్ కాంక్లేవ్ -1.0ను ఏర్పాటు చేశారు. ఇందులో పలు ప్రముఖ పరిశ్రమలు, సాఫ్ట్‌వేర్ కంపెనీల ఉన్నతాధికారులు పాల్గొని విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు.

**పరిశ్రమ-విద్యాసంస్థల మధ్య అంతరాన్ని తగ్గించాలి...**

నీమెట్ స్కెచ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ విశాల్ మణి మాట్లాడుతూ.. పరిశ్రమ-విద్యాసంస్థల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు గీతం వర్సిటీ కాంక్లేవ్ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. బాహ్య (పరిశ్రమ), సొంత నైపుణ్యాలపై కెరీర్ పురోగతి ఆధారపడి ఉంటుందని తెలిపారు. పరిశ్రమల డిమాండ్‌కు తగ్గట్టుగా నైపుణ్యాలను సమకూర్చుకోవాలని కోరారు. ఏటీఎంఈసీఎస్‌లో సీనియర్ ఉపాధ్యక్షుడు (ఇంజినీరింగ్) సంజయ్ సింగ్ మాట్లాడుతూ.. కృత్రిమమేధ ద్వారా ఉద్యోగులను తగ్గించుకునే ప్రయత్నంలో 75శాతం పరిశ్రమలు ఉన్నట్లు తెలిపారు. ఏఐ ద్వారా 2030 నాటికి మూడు కోట్ల ఉద్యోగాలు పోతాయని హెచ్చరించారు. రాబోయే పదేళ్లలో కోడింగ్ ప్రాధాన్యత తగ్గిపోతుందన్నారు. ఛాట్ జీపీటీలో నైపుణ్యాలను సమకూర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఏపీఐ, ఫ్రేమ్ వర్క్‌లతో ఎలా పనిచేయాలో నేర్చుకోవాలన్నారు. ప్రస్తుత ఆర్థిక మాంద్యం నేపథ్యంలో పట్టభద్రులు ఉన్నత విద్యాభ్యాసం చేయడం ఉత్తమమన్నారు. సిగ్నిటి టాలెంట్ అక్విజినేషన్ సీనియర్ ఉపాధ్యక్షుడు కరుణా వెంపల, కాలిన్స్ ఏరోస్పేస్ అసోసియేట్ డైరెక్టర్ జైపాల్ సింగ్, ఏటీఎంఈసీఎస్ సీనియర్ డైరెక్టర్ (ఇంజినీరింగ్, భానుప్రకాశ్, గ్లోబల్ మానవ వనరుల విభాగాధిపతి నరేన్ గుండాబత్తుల, గీతం కోర్ ఇంజినీరింగ్ డీన్ ప్రొఫెసర్ వీఆర్ శాస్త్రి మాట్లాడుతూ.. పరిశ్రమల అమసరాలు, డిమాండ్‌కు అనుగుణంగా విద్యార్థులు కోర్సులు, నైపుణ్యాలను నేర్చుకోవాలని కోరారు. కాంక్లేవ్‌లో కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నాతి వేణుకుమార్, కెరీర్ ఫుల్ ఫిల్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ బీబీపాటిల్ రాజీనామా



జహీరాబాద్, మార్చి 1: జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేస్తూ పార్టీ అధినేత కేసీఆర్‌కు లేఖ రాశారు. శుక్రవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఎంపీ బీబీపాటిల్ 2014, 2018 పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ నుంచి బీఆర్ఎస్ తరపున పోటీ చేసి ఎంపీగా గెలుపొందారు.



జహీరాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

## ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల ఆందోళన

**జహీరాబాద్ డిపోలో నిలిచిపోయిన 36 అద్దెబస్సులు**

**బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడిన ప్రయాణికులు**

జహీరాబాద్, మార్చి 1: జహీరాబాద్ ఆర్టీసీ డిపోలో అద్దెబస్సు డ్రైవర్లు శుక్రవారం ఆందోళన చేశారు. జీతాలు పెంచడంతోపాటు, ఉద్యోగ భద్రత కలిపించాలని డిమాండ్ చేశారు. దీంతో జహీరాబాద్ ఆర్టీసీ డిపోలో 36 అద్దెల బస్సులు నిలిచిపోయాయి. అద్దెబస్సు డ్రైవర్లకు జీతాలు పెంచాలని పలుమార్లు కోరినా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. తక్కువ జీతంతో ఎక్కువ సమయం పని చేయించుకుంటున్నారని ఆరోపించారు. బస్సుల్లో ప్రయాణికులు ఎక్కువగా ఉన్న సమయంలో ఎక్కడైన బస్సు నిలుపకపోతే, ప్రయాణికులు ఫిర్యాదు చేసిన వెంటనే ఉద్యోగం నుంచి తొలిగిస్తున్నారన్నారు. అద్దె బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్నా డీఎం బస్సులు నిలుపడంలేదని వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు జీతాలు పెంచేందుకు చర్యలు తీసుకొని, ఉద్యోగ భద్రత కల్పించేందుకు హామీ ఇవ్వాలన్నారు. డీఎం నుంచి రక్షణ కల్పించాలని కోరారు. అద్దె బస్సులు నిలిచిపోవడంతో బస్టాండ్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సుల కోసం గంటలతరబడి నిరీక్షించారు. కర్ణాటకకు చెందిన బస్సులు రావడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పాయి. బస్సుల కోసం ప్రయాణికులు ఇబ్బందులు పడినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.



జహీరాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల కోసం నిర్మిస్తున్న షెడ్లు

**అమృత్ భారత్ పథకం కింద జహీరాబాద్ రైల్వేస్టేషన్ ఎంపిక**

## ఆధునీకరణ పనులు పూర్తయ్యేనా..?

**రూ.24.40 కోట్లతో అభివృద్ధి పనులు**

**మార్చి వరకు పనులు పూర్తి చేస్తామని ప్రకటించిన రైల్వే అధికారులు**

**అసంపూర్తిగా షెడ్ల నిర్మాణ పనులు**

**రైలు కోసం ఎండలో నిలిచి ఉంటున్న ప్రయాణికులు**

జహీరాబాద్, మార్చి 1: జహీరాబాద్ రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించడం లేదు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కేంద్రప్రభుత్వం రైల్వేస్టేషన్ ఆధునీకరణ కోసం రూ.24.40 కోట్లు మంజూరు చేసింది. కేంద్రప్రభుత్వం అమృత్ భారత్ పథకం కింద ఈ రైల్వే స్టేషన్‌ను ఎంపిక చేసింది. ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా రైల్వే స్టేషన్ పనులకు శంకుస్థాపన చేశారు. కేంద్రం నిధులు మంజూరు చేసినా పనులు మాత్రం వేగంగా సాగడం లేదు. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల కోసం ఉన్న షెడ్లను కాంట్రాక్టర్ తొలిగించడంతో ఎండలో నిలిచి ఉండే పరిస్థితి నెలకొంది. స్టేషన్‌లో ప్రయాణికుల విశ్రాంతి గది ఉన్నా అవసరమైన కూర్చీలు లేక రైలు వచ్చే వరకు ఎండలో అవస్థలు పడుతున్నారు. వేసవిలోగా షెడ్ల నిర్మాణం పూర్తి చేస్తే ప్రయాణిలకు కొంత మేలు కలుగుతుంది. ఈనెల 5న ప్రధానమంత్రి మోదీ సంగారెడ్డికి వస్తున్నా రైల్వే అధికారుల్లో కదిక కనిపించడం లేదు.

**వ్యాపార, వాణిజ్యకేంద్రంగా జహీరాబాద్**

జహీరాబాద్ పట్టణం వ్యాపార, వాణిజ్య కేంద్రంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నది. కర్ణాటక, మహారాష్ట్రలకు సరిహద్దులో పట్టణం ఉండడంతో ప్రతిరోజూ వేలాదిమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధునీకరణ కోసం నిధులు మంజూరు చేయడంతో రైల్వే ఇంజినీరింగ్ అధికారులు టెండర్లు వేసి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. గతంలో గడువులోగా ఆధునీకరణ పనులు పూర్తి చేస్తామని, రైల్వే అధికారులు ప్రకటించినా ఇంతవరకు పూర్తిస్థాయిలో పనులు ముందుకు సాగడంలేదు. జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఝురాసంగం మండలంలో జాతీయ పారిశ్రామిక ఉత్పత్తి మండలి(నిమ్జ్)ను 12వేల ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వ్యాపార, వాణిజ్య రంగం మరింత అభివృద్ధిచెందనున్నది.

**నిజాంకాలంలో రైల్వే స్టేషన్ నిర్మాణం**

జహీరాబాద్ రైల్వేస్టేషన్‌ను నిజాంకాలంలో నిర్మించారు. రైల్వేస్టేషన్‌లో ఉన్న భవనం, షెడ్లు చిన్నగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. దీంతో జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ కోసం కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు కేంద్రం ఆధునీకరణ పనులు చేపట్టింది. రైల్వేస్టేషన్‌లో కొత్తగా భవనం, షెడ్లు నిర్మిస్తున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. పార్కింగ్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయగా, పార్కింగ్, పార్కు నిర్మాణ పనులు ప్రారంభించ లేదు. విశ్రాంతి గదులు, దివ్యాంగులకు వసతి సౌకర్యాలు కల్పించలేదు. మార్చిలోగా పనులు పూర్తి చేస్తామని అధికారులు ప్రకటించినా ముందుకు సాగడంలేదు. తాగునీటి సదుపాయాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూత్రశాలలు ఉన్నా వాటికి తాళాలు వేస్తున్నారు.

**అసంపూర్తిగా షాపింగ్ కాంప్లెక్స్**

జహీరాబాద్ రైల్వేస్టేషన్ ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ బాధ్యతలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారు. రైల్వేస్థలాన్ని ప్రైవేట్ వ్యాపారులకు లీజ్‌కివ్వడంతో భవన నిర్మాణం పూర్తయింది. కానీ షాపులు మాత్రం పూర్తి కాలేదు. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా రైల్వే అధికారుల పర్యవేక్షణ లేక పనులు ముందుకు సాగడం లేదు.

## ప్రధాని సభకు స్థల పరిశీలన

పటాన్‌చెరు, మార్చి 1: పటాన్‌చెరు పట్టణ సమీపంలోని పటేల్‌గూడకు వెళ్లేదారిలో ప్రధాని మోదీ నిర్వహించే బహిరంగ సభ స్థలాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్ శుక్రవారం పరిశీలించారు. ఈనెల 5న ప్రధాని సంగారెడ్డి(కంది) నుంచి మహారాష్ట్ర అకోలా వరకు వేసిన 161 నెంబరు జాతీయ రహదారిని ప్రారంభిస్తారు. బీజేపీ జిల్లా నాయకులు పటేల్‌గూడ సమీపంలోని ఖాళీ స్థలాన్ని ఎంపిక చేశారు. ఆ స్థలాన్ని కలెక్టర్, ఎస్పీ పరిశీలించి గ్రౌండ్ విస్తీర్ణం, భద్రతపరమైన ఏర్పాట్లు, ట్రాఫిక్ సమస్యలు, ఇతర అంశాలను చర్చించారు.

**ప్రధాని సభను విజయవంతం చేయాలి: గోదావరీఅంజిరెడ్డి**

ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరీ అంజిరెడ్డి కోరారు. శుక్రవారం పటాన్చెరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని జాతీయ రహదారిని ప్రారంభించిన అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. బీజేపీ నాయకులు, పార్టీ శ్రేణులు, అభిమానులు బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదేళ్లి రవీందర్, ఎడ్ల రమేశ్, జిల్లా ప్రధానకార్యదర్శి కొల్కూరు రాజశేఖర్‌రెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గం కన్వీనర్ శ్రీనివాస్‌గుప్తా, బీజేపీ నాయకులు వర్మ, నరేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రధాని నరేంద్రమోదీ సభ కోసం పటాన్‌చెరులో స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్


